పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరు పాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో, ఇసుక తేన్నెలపై ఆటలు ఆడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని, సరివి కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.

పర్యాటకులతో కిటకిటలాడుతున్న బీచ్

కేంద్రంలోని మోడీ సర్కార్ అన్నదాతకు కునుకులేకుండా చేస్తోంది. కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెంచేస్తూ అదనంగా పెట్టుబడి భారం నెత్తిమీద వేసింది. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు ఏళ్ల తరబడి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎరువుల నుంచి డీజిల్, పెట్రోల్ ధరలు పెరుగుదల రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో అందరికీ అన్నంపెట్టే రైతన్న ఆత్మహత్యలకు పాల్పడుతున్న దుస్థితి దాపురించింది. కాంప్లెక్స్ ఎరువుల ధరల పెంపుతో జిల్లా రైతాంగంపై అదనపు పెట్టుబడి భారం పడి నలిగిపోతున్న పరిస్థితి నెలకొంది.

అన్నదాతపై.. ఎరువుల పిడుగు..!

- కాంప్లెక్స్ ధరలు భారీగా పెరుగుదల
- 28.28.0 కాంప్లెక్స్ ఎరువు ధర రూ.1700పైనే
- అదేబాటలో ఇతర కాంప్లెక్స్ ఎరువుల ధరలు
- రెండు జిల్లాల రైతాంగంపై భారం
- రబీలో దాదాపు లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల వినియోగం
- ఎకరాకు రూ. 3 బస్తాల ఎరువులు తప్పనిసరి
- భారీగా పెట్టుబడి పెరుగుదల.. పండిన పంటలకు గిట్టుబాటు ధర కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రస్తుత రబీ సీజన్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తున్నారు. మరో లక్ష ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. పామాయిల్, మామిడి వంటి ఇతర పంటలు పెద్ద ఎత్తున రైతులు సాగుచేస్తున్నారు. రెండు జిల్లాల్లో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. కేంద్రంలోని మోడీ సర్కార్ రైతులను చిన్నచూపు చూస్తోంది. కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెరిగినప్పటికీ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోని పరిస్థితి నెలకొంది. దీంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు విపరీతంగా పెరగడంతో రబీసాగులో రైతులపై పెనుభారం పడింది. వరిసాగులో రైతులకు ఎకరాకు ఐదు నుంచి ఆరు బస్తాల ఎరువు ఉపయోగిస్తారు. ఇందులో మూడు బస్తాలు కాంప్లెక్స్ ఎరువు ఉంటుంది. ఏలూరు జిల్లాలో రబీలో 90 వేల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరి జిల్లాలో 62 వేల మెట్రిక్ టన్నుల వరకూ కాంప్లెక్స్ ఎరువులు ఉపయోగించనున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రైతులు ఎక్కువగా 28.28.0, 10.26.26, 12.32.16 వంటి కాంప్లెక్స్ ఎరువులను ఉపయోగిస్తారు. మొన్నటి వరకూ వీటి ధరలు 50 కిలోల బస్తా ధర రూ.1,470 వరకూ ఉండగా ఇప్పుడే ఏకంగా రూ.1,720కు చేరుకున్నాయి. బస్తాకు దాదాపు రూ.300 ధర పెరిగిపోయింది. ఇప్పటికే సబ్సిడీ పెద్ద ఎత్తున ఇస్తున్నామంటూ పెరిగిన ధరలను రైతులపైకి నెట్టేసిన పరిస్థితి ఏర్పడింది. రైతులు ఎకరాకు మరో రూ.వెయ్యి వరకూ అదనంగా పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రైతులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. వరిసాగులో ఆరునెలల కష్టపడినా ఎకరాకు రూ.ఐదు నుంచి రూ.ఆరు వేలు కూడా మిగలని పరిస్థితి. అదీ కూడా ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలూ సంభవించకుండా ఉంటే మాత్రమే. జిల్లాను ఏటా పెద్దఎత్తున తుపాన్లు వెంటాడుతున్నాయి. ఖరీఫ్ పంట సక్రమంగా చేతికి అందడం లేదు. గడిచిన ఖరీఫ్‌లోనూ భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎరువుల ధరలు పెరుగుదలతోపాటు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల రైతులకు భారంగా మారింది. డీజిల్ ధర పెంపుతో దుక్కుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. గతంలో సాలుకు రూ.వెయ్యి ఉంటే, ఇప్పుడు అది రెట్టింపు దాటిపోయింది. ఇలా రైతులపై ప్రభుత్వం పెనుభారాలు మోపడంతో వ్యవసాయాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేస్తోంది. దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న దుస్థితి నెలకొంది.

గిట్టుబాటు ధర అమలుకు మాత్రం ససేమీరా

వ్యవసాయ పెట్టుబడులు ఏటా పెరుగుతూనే ఉంటున్నాయి. అందుకు తగిన విధంగా పంటలకు ధర రావడం లేదు. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు గత కొన్నేళ్లుగా ఎడతెరలేపి లేని పోరాటం చేస్తున్నారు. మోడీ సర్కార్ ముందుకు రావడం లేదు. గిట్టుబాటు ధరపై చట్టం చేసేందుకు మోడీ సర్కార్ వ్యవహరిస్తున్న తీరే రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చట్టం చేసినప్పుడు రైతులకు మేలు జరుగుతోంది. లేకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకొచ్చే పరిస్థితి లేకుండా పోతుంది.

ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని అంగన్‌వాడీ పిల్లల నమోదుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసిన ఆరేళ్ల పిల్లలకు కొత్త ఆధార్ కార్డు నమోదు చేసేందుకు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు, 27 నుంచి 30వ తేదీ వరకూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో మొత్తం 90 ఆధార్ కేంద్రాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసి జిల్లాలోని ఆధార్ కార్డు లేని పిల్లలున్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, సిడిపిఒలు అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లల తల్లిదండ్రులకు తెలియజేసి అవసరమైన ధృవ పత్రాలతో ప్రత్యేక ఆధార్ క్యాంపుల్లో కొత్త ఆధార్ కార్డులు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు ఆధార్ కార్డులు లేని పిల్లలందరికీ నూరు శాతం కొత్త ఆధార్ కార్డుల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

జిల్లా వ్యాప్తంగా 90 ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ఆచంట - 2, ఆకివీడు- 4, అత్తిలి- 3, భీమవరం-6, యలమంచిలి- 4, గణపవరం-5, ఇరగవరం- 3, కాళ్ల - 4, మొగల్తూరు - 4, నరసాపురం - 3, పాలకొల్లు - 3, పాలకోడేరు - 3, పెనుగొండ - 3, పెనుమంట్ర - 3, పోడూరు - 4, తాడేపల్లిగూడెం- 3, తణుకు - 6, ఉండి - 3, వీరవాసరం-4 ఆధార్ కేంద్రాలను, అర్బన్ మండలాల్లో భీమవరం-4, నరసాపురం-4, పాలకొల్లు-3, తాడేపల్లిగూడెం-3, తణుకు-6 ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భీమవరం ప్రకాశంచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న వివిధ సంఘాల నేతలు

సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

రైతు, కార్మిక సంఘాల నేతల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

రాబోయే రోజుల్లో ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు సాగించాలని రైతు, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చాయి. నాటి పాలకులు ప్రజలపై బలవంతాన రుద్దిన సంస్కరణల ఫలితమే నేడు ఎదురవుతున్న సమస్యలకు మూలమని విమర్శించారు. ఆదివారం ప్రకాశంచౌక్‌లో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నాడు నూతన ఆర్థిక విధానాల పేరుతో తీసుకొచ్చిన సంస్కరణలు ప్రజలకు ఉపయోగపడకపోగా కష్టాలకు కడగండ్లకు గురిచేశాయని అన్నారు. కాంగ్రెస్ పాలకులు దేశాన్ని నాశనం చేశారని, తాను అధికారంలోకి వస్తే ఉద్ధరిస్తానని చెప్పిన ప్రధాని మోడీ పదేళ్లు అయినప్పటికీ సమస్యలు పరిష్కరించలేకపోయారని విమర్శించారు. ధరలు తగ్గించలేకపోవడానికి ఉపాధి కల్పించలేకపోవడానికి కారణాలు చెప్పలేని స్థితిలో నేటి పాలకులు ఉన్నారన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడుతూ ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ విధానాలు అమలు చేయడం వల్లే జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. కార్మికులు ఉపాధి కోల్పోయారని, వ్యవసాయం, ఆక్వా రంగాలు నష్టాల్లో ఉన్నాయన్నారు. ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును పరిరక్షించడం కోసం ప్రభుత్వం చేయాల్సిన పనులు పక్కనపెట్టి ప్యాకేజీలతో మరింత మోసం చేయాలని చూస్తోందన్నారు. విశాఖ ఉక్కును అమ్మేస్తామని చెప్పిన పాలకులు కార్మికుల పోరాటాలకు తలొగ్గి ప్యాకేజీని ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షత వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, రైతు సంఘం నాయకులు నారాయణరావు, రాము, బాబూరావు, మృత్యుంజయ పాల్గొన్నారు.

భీమవరం అభివృద్ధికి డిజైన్లు పూర్తి చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డిజైన్లను త్వరితగతిన పూర్తి చేసి అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద, ఆర్‌టిసి డిపో వద్ద బస్‌స్టాప్‌ల నిర్మాణాలకు స్థలాలను పరిశీలించారు. వీటికి సంబంధించిన డిజైన్లను రూపొందించి రానున్న రెండు రోజుల్లో అందజేయాలని మున్సిపల్ సర్వేయర్లను ఆదేశించారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా బస్టాప్ నిర్మాణ వ్యయాన్ని భీమవరం హాస్పిటల్స్ యాజమాన్యం, ఆర్‌టిసి డిపో వద్ద బస్‌స్టాప్ నిర్మాణానికి ఐఎంఎ నుండి నిధులను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. అనంతరం హౌసింగ్ బోర్డులోని కళావేదిక పార్కు అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇప్పటికే రూ.10 లక్షల వ్యయాన్ని పార్కు అభివృద్ధికి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఖర్చు చేయడం జరిగిందని, మరికొన్ని కళాకృతుల ఏర్పాటుకు వెంటనే మార్కింగ్స్ ఇవ్వాలని మున్సిపల్ సర్వేయర్‌ను ఆదేశించారు. ఓల్డ్ బస్టాండ్ పున:నిర్మాణానికి వెంటనే డిజైన్లను రూపొందించి నిర్మాణ దాతకు అందజేయాలని ఆర్‌టిసి డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డిపో మేనేజర్ పిఎస్‌వి.ఎం.సత్యనారాయణమూర్తి, మున్సిపల్ ఇంజినీర్ త్రినాథరావు, ఐఎంఎ ప్రతినిధి సిహెచ్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి - నరసాపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేత కార్మికులకు గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక 12వ వార్డు వీవర్స్ కమిటీ హాల్లో చేనేత కార్మిక సంఘం, వీవర్స్ యునైటెడ్ ఫ్రెండ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి వీవర్స్ యునైటెడ్ ఫ్రెండ్ జిల్లా కన్వీనర్ కనకం వరప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత చేనేత ప్రధానమైన వృత్తి అని చెబుతున్న పాలకులు బడ్జెట్లో చేనేతకు నిధులు లేకుండా చేయడం అన్యాయమన్నారు. తక్షణం చేనేత కార్మికుల సమస్యలపై 2000 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికై చర్యలు తీసుకోవాలన్నారు. చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలి లేదా రీయంబర్స్మెంట్ అమలు జరపాలని డిమాండ్ చేశారు. నేతన్న నేస్తం ప్రతి చేనేత కార్మికునికి ఇవ్వాలని, బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత మహిళలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సహాయం చేయాలని, చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా అమలు జరపాలని, కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏపీ చేనేత కార్మిక సంఘం బూడిద జోగేశ్వరరావు, వాసా రామలింగం, వరద బసవ కోటయ్య, సమతం చిన్న, సముద్ర లింగం,వీవర్స్ యునైటెడ్ ఫ్రెండ్ నాయకులు ఒగ్గు సత్యనారాయణ, బళ్ల రమేష్ కుమార్ పాల్గొన్నారు.

అమిత్ షాను భర్తరఫ్ చేయాలి

- అంబేద్కర్‌ను అవహేళన చేయడం దుర్మార్గం
- పార్లమెంటు సాక్షిగా అమిత్ షా దేశ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలి
- అమిత్ షా గోబ్యాక్ అంటూ వామపక్షాల ఆధ్వర్యాన నిరసనలు

భీమవరం : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవహేళన చేసి మాట్లాడడం అత్యంత దుర్మార్గమని, తక్షణం అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. భీమవరం అంబేద్కర్ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన అమిత్ షా గో బ్యాక్ కార్యక్రమంలో వామపక్ష నేతలు చేసిన నినాదాలతో పట్నం హోరెత్తింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు అధ్యక్షత వహించగా వామపక్ష పార్టీలు, దళిత సంఘాలు మద్దతు తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ దేశంలో పరిపాలన రాజ్యాంగం ఆధారంగానే పరిపాలన కొనసాగుతుందన్నారు. ప్రధానమంత్రైనా, మంత్రివర్గమైనా, రాష్ట్రపతైనా, రాష్ట్ర హోంమంత్రైనా రాజ్యాంగంపై ప్రమాణం చేసి పరిపాలన కొనసాగిస్తుంటారన్నారు. అదే రాజ్యాంగంపై ప్రమాణం చేసిన రాష్ట్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ రూప శిల్పి అంబేద్కర్‌ని హేళన చేసి మాట్లాడడం అంటే అంతకంటే దుర్మార్గమైన చర్య మరొకటిలేదన్నారు. దేశ ప్రజానీకమంతా అమిత్‌షా వ్యాఖ్యలపై ఆందోళన చెందుతుంటే ప్రధానమంత్రి గాని, అమిత్ షా గాని దీనిపై నోరుమెదపడంలేదన్నారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచి, మనుధర్మశాస్త్రాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అమిత్ షాను ప్రధానమంత్రి తన మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, పార్లమెంట్ సాక్షిగా దేశ ప్రజలకు క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ అట్టడుగున ఉన్న పేద, బలహీన వర్గాలకోసం, మహిళా, విద్యార్థుల, యువకుల కోసం, ప్రజలందరికోసం రచించిన భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడవడానికి చేసే ప్రయత్నాలే ఈ ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకుల వ్యాఖ్యలు అన్నారు. పార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకులు లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ అంబేద్కర్ ఈ దేశ రాజ్యాంగ నిర్మాతని అవమానపరచి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. దళిత ఐక్యవేదిక గంటా సుందర్‌కుమార్, ఎపి బహుజన జెఎసి నాయకులు బిరుదుగడ్డ రమేష్ మాట్లాడుతూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వామపక్షపార్టీలు చేస్తున్న ఈ ఆందోళనకు మద్దతు తెలియజేస్తున్నామన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రపూరిత చర్యలు చేస్తోందన్నారు. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా ఆందోళన చెందుతుంటే రాష్ట్రంలో ఉన్న ఏ ఒక్క పార్టీ నాయకుడు కూడా ఖండిచడం లేదంటే వారు ఎవరి పక్షాన, ఎవరికి అండగా ఉన్నారో అర్థంచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, సిపిఎం కార్యకర్తలు బాతిరెడ్డి జార్జి, పుల్లారెడ్డి, మల్లిల్లపూడి రామాంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వడుగు వెంకటేశ్వరరావు, పార్వర్డ్ బ్లాక్ నాయకులు దుండు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పెంటపాడు : వామపక్షాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సిపిఎం ఆధ్వర్యాన పెంటపాడు గేటు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా గో బ్యాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమం ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి సిరవరపు రంగారావు, బంకూరు నాగేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి గత నెలలో పార్లమెంటులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యానాలు అంబేద్కర్‌ను అవమానపరిచేలా ఉన్నాయన్నారు. ఈరోజు పార్లమెంట్‌లో కాని, శాసనసభలో కాని ఆయన సూచించిన విధానాలే లౌకిక భారతదేశం ముందుకు సాగుతుందన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన హోంమంత్రి ఈవిధమైన వ్యాఖ్యానాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆయన్ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గా, కరక వెంకట్రావు, మీసాల శ్రీనివాస్, బొడ్డపాటి శివ, బర్ల బాలాజీ పాల్గొన్నారు.

తణుకు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని అవమానకరంగా మాట్లాడిన అమిత్ షా క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని ఇరగవరం సిపిఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి అన్నారు. ఆదివారం ఇరగవరం మండలం ఇరగవరంలోని బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ముందు సిపిఎం ఆధ్వర్యంలో కార్యకర్తలు నిరసన తెలియజేశారు. అమిత్ షా గోబ్యాక్, గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ రాజ్యసభలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరును ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడిన అమిత్ షా రాష్ట్రంలో అడుగుపెట్టే హక్కు లేదన్నారు. గత రెండు రోజుల నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నారని, అమిత్ షా రాష్ట్రం నుంచి వెనక్కి వెళ్లిపోవాలని సిపిఎం కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు పిల్లి కోటేశ్వరరావు, జక్కంశెట్టి గంగాధరరావు, తూరుగొపు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

హెల్మెట్ తప్పక వినియోగించాలి

36వ జాతీయ భద్రతా మాసోత్సవాల్లో రవాణా శాఖ తనిఖీ అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను వినియోగించాలని జిల్లా రవాణా శాఖ తనిఖీ అధికారులు కోరారు. 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం భీమవరంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని రవాణా శాఖ అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భీమవరం రవాణా కార్యాలయానికి చెందిన రవాణా తనిఖీ అధికారులు పాల్గొని వాహనదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలు నడిపే సమయాల్లో సెల్‌ఫోన్ మాట్లాడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా తనిఖీ అధికారులు కె.ప్రసాద్, ఎం.రవికుమార్, ఎన్ఎల్ఎస్ లక్ష్మి, ఎఎస్‌పి తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ప్రతి ఒక్కరూ సమిష్టిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని తాడేపల్లిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డిఎస్.నాయక్ సూచించారు. ఈనెల 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరగనున్న ఎపిఎస్‌ఆర్‌టిసి రోడ్డు భద్రత మసోత్సవాలలో భాగంగా తాడేపల్లిగూడెం డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రారంభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడేపల్లిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాయక్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత అంటే చోదకులు, బస్సు ప్రయాణికులు, రోడ్డు మీద నడుస్తున్న ఇతర పాదాచార్లు, ఇతర వాహన చోదకుల భద్రత కనుక ప్రతి ఒక్కరూ సమిష్టిగా ఈ భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. డిపో మేనేజర్ మూర్తి మాట్లాడుతూ ఈ మాసోత్సవాల సందర్భంగా జీరో ప్రమాద లక్ష్యాన్ని సాధించే దిశగా కండక్టర్, డ్రైవర్లు, మెకానికల్ సూపర్వైజర్లు కూడా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది, సూపర్వైజర్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నాయక్

గత ప్రభుత్వ విధానాలతో 600 మంది ఉద్యోగాలకు దూరం

డ్యూయల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్

ప్రజాశక్తి - భీమవరం

2008 డిఎస్‌సి నోటిఫికేషన్‌లో అంతర్భాగమైన జిఒ 112ను గత ప్రభుత్వం అమలు చేయకపోవడంతో సుమారు 600 మంది ఉద్యోగాలకు దూరమయ్యారని 2008 డిఎస్‌సి డ్యూయల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ కుమార్ అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఎంఎల్‌సి బి.గోపీమూర్తికి గత డిఎస్‌సిలో ఏర్పడిన ఇబ్బందులపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో డిఎస్‌సి అభ్యర్థులకు పోస్టులు రాణి పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. డ్యూయల్ పోస్టులు అర్హులకు ఇప్పించే విధంగా న్యాయం చేయాలని కోరారు. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ నిరంతరం పనిచేస్తుందన్నారు. 2008 డిఎస్‌సికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, నాగలింగం, హేమలత, వెంకటేశ్వరావు, డేవిడ్ రాజు, రాజకుమార్ నాగవేణి, తానేశ్వరి ఉన్నారు.



ఎంఎల్‌సి గోపీమూర్తికి వినతిని అందజేస్తున్న నాయకులు

ఎల్ఐసిని బలపర్చండి

బీమా విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు బాబాయి శర్మ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గడిచిన 69 సంవత్సరాలలో కేవలం ఐదు కోట్ల రూపాయల పెట్టుబడితో ప్రారంభించిన ఎల్ఐసి దిన దిన ప్రవర్ధమానంగా ఎదిగి ప్రజల నమ్మకాన్ని పెట్టుబడిగా నేడు రూ.55 లక్షల కోట్ల ఆస్తులతో ప్రపంచ స్థాయి సంస్థగా ఎదిగిందని బీమా విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గరికపాటి బాబాయి శర్మ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేట్ బీమా కంపెనీల ఆగడాల నుంచి ప్రజల సొమ్ముకు భద్రత కల్పించాలనే ఆశయంతో 1956 జనవరి 19న అప్పటి దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జీవిత బీమా సంస్థను జాతీయకరణ చేశారన్నారు. 40 కోట్ల పట్టాదారులకు ఆర్థిక భద్రత కలగజేస్తూ, ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలకు సమకూరుస్తుందన్నారు. బీమా ప్రీమియంలపై జిఎస్టి తొలగించి సంస్థ అభివృద్ధికి మరింతగా సహకరించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రోగులతో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగేశ్వరరావు

ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రోగులకు మెరుగైన వైద్యం అందించే దిశగా ప్రభుత్వ ఆసుపత్రులను మరింత అభివృద్ధి చేసేందుకు ఎన్డిఎ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎఎంసి ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఏరియా ఆసుపత్రిని కూటమి నాయకులు పరిశీలించారు. రోగుల దగ్గరికి వెళ్లి వైద్యం ఎలా అందుతుంది, మందులు సక్రమంగా అందిస్తున్నారా అని ఆరా తీశారు. అదేవిధంగా ప్రభుత్వ డాక్టర్లకు ప్రతి రోగికి నాణ్యమైన చికిత్స అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఇందుకూరి శివాజీ వర్మ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వెంకటరామయ్య, నాయకులు గంట త్రిమూర్తులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు దోపిడీకి పన్నాగం

వైసిపి జిల్లా మాజీ అధికార ప్రతినిధి బాలాజీ గౌడ్

ప్రజాశక్తి - ఉండి

విశాఖ ఉక్కు దోపిడీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నాగాలు పన్నుతున్నాయని వైసిపి జిల్లా మాజీ అధికార ప్రతినిధి ఉద్దరాజు బాలాజీ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రత్యేక హోదా అంశాన్ని పక్కన పెట్టేందుకు పదవేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. రెండు లక్షల కోట్ల పైచిలుకు ఉన్న విశాఖ ఉక్కు ఆస్తులను కాజేసేందుకు విశాఖ ఉక్కుకు 10,300 కోట్లు తర్వాత ఇవ్వడమే కాకుండా విశాఖ ఉక్కు ఆస్తులను 7,686 కోట్లుగా చిత్రీకరించడంలో కేంద్ర ప్రభుత్వం అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును అమ్మాలనే కేంద్ర ప్రభుత్వ కుయుక్తులను వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆనాడు అడ్డుకున్నారని, కానీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోపాయకారి ఒప్పందంతో రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీ పెద్దలకు తాకట్టుపెట్టారని బాలాజీ గౌడ్ ఆరోపించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, దీనిని ప్రయివేటీకరించాలనే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

నాగేంద్ర కుమార్‌కు అభినందనలు

పాలకొల్లు : పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శిగా కరాని నాగేంద్ర కుమార్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఛాంబర్ భవనంలో ఆయనను ఛాంబర్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ పాలకొల్లులో ప్రజల సమస్యల పరిష్కారానికి ఛాంబర్ తరపున కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆయనను ఘనంగా సత్కరించారు. క్లబ్ గవర్నర్ పెనుమత్స రామాంజనేయులు, అధ్యక్షులు జక్కంపూడి మదన్, కార్యదర్శి వేదుకొండ దుర్గా ప్రసాద్, కోశాధికారి శిరిగినీడి నాగరాజు, వ్యవస్థాపకులు పోకల రాము పాల్గొన్నారు.

నేడు కల్లు గీత కార్మిక సంఘం సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 20 సోమవారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం మండల సమావేశం జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. పెనుమంట్రలోని ఎస్ఆర్ దాట్ల ట్రస్టులో మండల నాయకులు బలుసు వెంకటి బాలాజీ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నేత జుత్తిగా నరసింహమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు. కల్లు గీత కార్మిక సంఘ నాయకులు, సభ్యులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నరసాపురం ఆర్డిఓ దాసిరాజు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డివిజన్లో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10:30 నిమిషాల నుంచి అందించాలని కోరారు.

అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ..

ప్రజాశక్తి - నరసాపురం

సీతారాంపురం నార్త్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలో 1967-74 మధ్య కాలంలో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 50 ఏళ్ల క్రితం పాఠశాలలో జరిగిన మధుర, మధురమైన సంఘటనలను పూర్వ విద్యార్థులు జ్ఞాపకం చేసుకున్నారు. ఆనాడు జరిగిన అందమైన సంఘటనలను తలుచుకుంటూ ఆనందంగా గడిపారు. గత ఐదేళ్లుగా క్రమం తప్పకుండా ఇలా కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో పలువురు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో పలు రంగాల్లో స్థిరపడిన పలువురు పూర్వ విద్యార్థులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు గణపాముల కంతారావు, చినమిల్లి వెంకట్రావు, సిరా జక్కయ్య, మద్దాల వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుడి అరెస్ట్

7 మద్యం సీసాల స్వాధీనం

పాలకొల్లు : పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పోలీసులు ఆదివారం నిర్వహించిన దాడులలో పాలకొల్లు మున్సిపాలిటీ ఏరియాలో జె.మునియ్య నాయుడు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో ఎస్ఐలు పి.మహేష్, జె.రమ, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ హెచ్చరించారు.

కొత్త బట్టలు కొనలేదని..

ప్రజాశక్తి - ఉండి

కొత్త బట్టలు కొనలేదని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉండి మండలం మహదేవపట్నం గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహదేవపట్నం గ్రామానికి చెందిన చేపల కనకమహాలక్ష్మి అనే వివాహిత భర్తతో విడిపోయి తల్లి చేపల దుర్గ ఇంటి వద్దనే ఉంటుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్త బట్టలు కొనాలని తల్లిని అడుగగా బట్టలు కొనలేదని కనకమహాలక్ష్మి తల్లితో గొడవపడి సంక్రాంతి పండుగ రోజున ఇంట్లోంచి వెళ్లిపోయింది. నాటి నుంచి నేటి వరకు వెతికినా కనకమహాలక్ష్మి ఆచూకీ దొరకకపోవడంతో ఉండి పోలీసులకు తల్లి దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం

కబడ్డీ అందరికీ దగ్గరైన ఆట
కలెక్టర్ నాగరాణి
ముగిసిన జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

కబడ్డీ గ్రామీణ క్రీడ, అందరి హృదయానికి దగ్గరైన ఆట, చిన్నప్పుడు ఎంతో ఇష్టంగా ఆడేవారమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. నరసాపురం పట్టణం రస్తుంబాదలో శ్రీగోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో,

మహిళా విజేత జట్టుకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్

కొత్తపల్లి సోదరుల సారథ్యంలో ఐదు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు శనివారం అర్ధరాత్రి ముగిశాయి. ఈ కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమమునకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మి ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పలు మ్యాచ్‌లను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో యువత చెడు అలవాట్లకు మరలకుండా గత 35 సంవత్సరములుగా శ్రీగోగులమ్మ తల్లి ఉత్సవ కమిటీ, కొత్తపల్లి సోదరుల సారథ్యంలో దేశంలో పలు రాష్ట్రాల నుంచి క్రీడాకారులను తీసుకువచ్చి, సాంప్రదాయ గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తూ.. జాతీయస్థాయి స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించడం గర్వకారణం అన్నారు. కబడ్డీ గ్రామీణ క్రీడగా అందరికీ హృదయానికి దగ్గరైన ఆట అన్నారు. చిన్నతనంలో ఎంతో ఇష్టంగా ఆడేవారమని చెప్పారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక ధృఢత్వం పెరుగుతుందని అన్నారు. నరసాపురంలో కబడ్డీకు ఇంత గొప్ప స్టేడియం ఉండడం గొప్ప విషయమని తెలిపారు. అమ్మాయిలు, అబ్బాయిలు కూర్చుని చక్కగా క్రీడలను వీక్షించడం చాలా సంతోషం అనిపించిందన్నారు. నేనైతే చాలా బాగా ఎంజాయ్ చేశానన్నారు. క్రీడలను ఆడటం చాలా ముఖ్యం. గెలుపొందామా, ఓడామా అనేది పక్కన పెడితే ధైర్యంగా క్రీడకు సన్నిద్ధమై ముందుకు వచ్చి, వేలమంది ముందు ఆడటం గొప్ప విషయమని అన్నారు. జీవితంలో గెలుపుకు క్రీడలు దోహదపడతాయన్నారు. పిల్లలను చదువుతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా యువత మెరుగైన అవకాశాలని అందిపుచ్చుకోవచ్చు అన్నారు. గ్రామీణ క్రీడలు అంతరించిపోకుండా ఇటువంటి కమిటీలు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. యువతకు క్రీడలపై మక్కువ పెంచడం ద్వారా చెడు వ్యసనాలకు దూరం చేయవచ్చు అన్నారు. తద్వారా మానసిక ఉల్లాసం పెంపొందించడంతోపాటు, హింసా ప్రవృత్తికి అడ్డుకట్ట వేయవచ్చు అన్నారు. మాజీ మంత్రి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాల నుంచి అనేకమంది ఇక్కడకు వస్తూ ఉంటారు, వారందరికీ ఆహ్లాదకరంగా ఉండేందుకు శ్రీగోగులమ్మ తల్లి ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలు ఆనందాన్ని కలిగిస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారన్నారు.

పురుషులకు భాగంలో ఫైనల్ మ్యాచ్లో మొదటి స్థానం కోసం మహారాష్ట్ర, కోల్‌కత్తా జట్ల మధ్య పోటీ నువ్వా నేనట్లుగా సాగింది. ప్రేక్షకులు పాయింట్లు తెచ్చినప్పుడల్లా క్రీడాకారులు మద్దతు పలికారు. అనంతరం స్త్రీ, పురుషుల జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందిన పురుషుల విభాగంలో మహారాష్ట్ర ప్రథమ స్థానం, కొలకత్తా ద్వితీయ స్థానం, సిఆర్‌పిఎఫ్ ఢిల్లీ తృతీయ స్థానం, కొలకత్తా పోలీస్ నాలుగో స్థానంలో నిలిచాయి. మహిళా విభాగంలో

పురుష విజేత జట్టుకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్

సిఆర్‌పిఎఫ్ ఢిల్లీ మొదటి స్థానం, రాజస్థాన్ రెండో స్థానం, కోలకత్తా, కేరళ జట్లు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. మొదటి స్థానంలో నిలిచిన జట్లకు రూ.1.50 లక్షల నగదు, షీల్డ్, ద్వితీయ జట్టుకు రూ.లక్ష, తృతీయ రూ.75 వేలు, నాల్గో స్థానంలో నిలిచిన జట్లకు రూ.50 చొప్పున ప్రైజ్ మనీని జట్లకు కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. అనంతరం మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్, ప్రముఖ వ్యాపార వేత్త, జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్, ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద మాట్లాడుతూ 30 ఏళ్లుగా నిర్విరామంగా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొత్తపల్లి భుజంగ రాయుడు, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర సిఇఒ బి.వీర్లవెంకయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి వి.శ్రీనివాస్, కార్యదర్శి ఇ.పద్మజ బాల, గుగ్గిలపు మురళీ, వన్నెంరెడ్డి శ్రీనివాస్, చినిమిల్లి మమ్ము, యాదంరెడ్డి మహేష్, అడబాల బాబులు పాల్గొన్నారు.

లైఫ్ టాక్స్ మినహాయింపు అవకాశాన్ని వినియోగించుకోవాలి

నూతన విద్యుత్ వాహన కొనుగోలుదారులకు వర్తింపు
జిల్లా రవాణాధికారి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను(లైఫ్ టాక్స్) మినహాయింపు అవకాశాన్ని జిల్లాలో నూతన విద్యుత్ వాహన కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు తెలిపారు. 2019కి ముందు విద్యుత్ వాహనాల కొనుగోలుపై అమలు చేసిన జీవిత పన్ను మినహాయింపుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మళ్లీ ఈ ఏడాది జనవరి నుంచి అమలులోకి తీసుకొచ్చిందన్నారు. కాలుష్యం రోజురోజుకూ తీవ్రమవుతున్న దృష్ట్యా, వాయు కాలుష్య నియంత్రణ చర్యలలో భాగంగా ప్రభుత్వం విద్యుత్ వాహనాల ద్వారా కాలుష్యం తగ్గించవచ్చని సమీక్ష చేసి, విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను మినహాయింపు మరలా అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కొనుగోలు చేసిన, రిజిస్టర్ చేసుకున్న అన్ని స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నును మినహాయిస్తూ ఐదేళ్ల కాలం పరిమితికి ఈనెల నుంచి జనవరి 2030 వరకు అమలులో ఉండేలా ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని తెలిపారు. పన్ను మినహాయింపు స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని, హైబ్రిడ్ వాహనాలకు వర్తించదన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ టిఆర్ జారీ చేసిన వాహనాలకు, ఆంధ్రప్రదేశ్‌లోని డీలర్లు ఇతర రాష్ట్రాలకు టిఆర్‌లు జారీచేసిన లైఫ్ టాక్స్ మినహాయింపు వర్తించదని తెలిపారు. రాష్ట్రం వెలుపల ఎలక్ట్రిక్ టిఆర్ పట్ల విద్యుత్ వాహన కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పర్యావరణ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజలు విద్యుత్ వాహనాలను కొనుగోలు ద్వారా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వరరావు కోరారు.

ప్రశాంతంగా రేషన్ డీలర్ల నియామక పరీక్ష

నరసాపురం : చౌక దుకాణంలో రేషన్ డీలర్ల నియామకానికి నిర్వహించిన రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని వైఎన్ కళాశాల ఎంసిఎ బ్లాక్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రంలో పరీక్షలను నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు తనిఖీ చేశారు. నరసాపురం సబ్ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 20 చౌక దుకాణాలకు 63 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. 63 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 56 మంది హాజరయ్యారని, ఏడుగురు గైర్హాజరు అయ్యారని దాసిరాజు తెలిపారు.

వృద్ధురాలును పరీక్షిస్తున్న వైద్యులు

వృద్ధులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్రవైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు డాక్టర్ నీలు మహేంద్ర, సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరిలు సజ్జాపురం ప్రాంతంలో పర్యటించి ఆరుగురు వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. సంఘ సభ్యులు పాతూరి శివన్నారాయణ ఆర్థిక సహకారంతో ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిజిజాల నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య సేవలు కోరువారు స్వయంగా గాని, సెల్ 9985343530 నెంబరును సంప్రదించవలెనని తెలియజేశారు.

సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో మాజీ ఎంఎల్ఎలు చేగొండి హరరామ జోగయ్య, అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ బాబ్జిల వద్ద పనిచేసే అదృష్టం తనకు దక్కిందని రాష్ట్ర జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ తరంగిణి సారథ్యంలో పాలకొల్లు ఆణిముత్యాలైన మాజీ ఎంఎల్ఎలు చేగొండి హరరామ జోగయ్య, అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ బాబ్జిలను ఆదివారం రాత్రి స్థానిక లయన్స్ కమ్యునిటీ హాలులో మంత్రి ఘనంగా సత్కరించారు. ఇటువంటి ప్రముఖులను చూసేందుకు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు, తెలంగాణకు వెళ్లవలసి ఉంటుందని అయితే పాలకొల్లు ప్రజలకు ముగ్గురు ప్రముఖులను ఇక్కడే చూసే అదృష్టం కలిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ అధ్యక్షుడు కారుమూరి నరసింహారావు, నారాయణ రావు, సత్యనారాయణ, వంగా నరసింహారావు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న నిమ్మల

కృష్ణమూర్తి సేవలు మరువలేము

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్

ప్రజాశక్తి - పెనుమంట్ర

రజక సంఘానికి, సిపిఎంకు సానుభూతి పరునిగా కృష్ణమూర్తి అందించిన సేవలు మరువలేమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆదివారం స్థానిక మండలంలోని మాముడూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన సిపిఎం పొలమూరి కృష్ణమూర్తి సంస్మరణ సభలో ఆయన పాల్గొని నివాళులు అర్పించారు. రజక సంఘం జిల్లా అధ్యక్షులు మడక రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణమూర్తి లేని లోటు రజక సంఘానికి తీరనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు యండమూరి నాగేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.చిన్న, వీరభద్రం, సిఐటియు నాయకులు నేతల చిత్త రంజన్, కెవిపిఎస్ నాయకులు బి.విజయకుమార్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కె.సుబ్బరాజు, మహిళా సంఘం జిల్లా నాయకులు కె.పద్మజ పాల్గొన్నారు.

వృద్ధుల చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - ఆకివీడు

చట్టం వృద్ధులకు అన్ని విధాల అండగా ఉంటుందని, ఎవరికి ఏవిధమైన సమస్య వచ్చినా పూర్తి సహాయ సహకారాలు ప్రభుత్వం ద్వారా అందజేస్తామని వికలాంగులు, వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ చెప్పారు. సర్ ఆర్థర్ కాటన్ ఆకివీడు మండలం వృద్ధుల సంక్షేమ సంఘం, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు సంయుక్తంగా స్థానిక లయన్స్ హాల్లో ఆదివారం వృద్ధులకు వృద్ధుల చట్టం 2007పై అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వృద్ధుల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎంవి.సూర్యనారాయణ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వృద్ధుల చట్టం 2023 ప్రకారం వృద్ధులు రాసిన ఆస్తి సెటిల్మెంట్ హక్కును వెనక్కి తీసుకోవచ్చునని, సెక్షన్ 5 ప్రకారం తల్లిదండ్రులను బాధ్యత లేకుండా వదిలేసిన వారికి జైలు శిక్ష, జరిమానా ఆయన చెప్పారు. ఈ చట్టం వివరాలు పూర్తిగా తెలియజేస్తూ తల్లిదండ్రులను వదిలేసిన వారి వద్ద నుంచి వృద్ధులు నెలకు పదివేల రూపాయలు పించనుగా ఆర్‌డిఒ ఆదేశాలతో పిల్లల నుంచి పొందవచ్చునన్నారు. ఆస్తుల కోసం పిల్లలు నటిస్తారని, వారి వద్ద అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. 60 సంవత్సరాల వయసు దాటిన వృద్ధులకు ప్రభుత్వం చేతికి చెవిటి మిషన్లు వంటివి ఉచితంగా అందజేస్తారని ఆయన చెప్పారు. సమావేశంలో వృద్ధుల సంఘం అధ్యక్షులు బొబ్బిలి బంగారాణి మాట్లాడుతూ మంగళవారం చేతి కర్రల పంపిణీ చేపడుతున్నామని చెప్పారు. అందుకోసం అవసరమైన వారు ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, రేషన్ కార్డు కాపీ తెచ్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో దాత డాక్టర్ బిలాల్ మాట్లాడుతూ వృద్ధులకు అవసరమైన సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధుల సంఘ కార్యదర్శి అడవి సుబ్బారావు, సభ్యుల ప్రసాదరావు, గొంట్ల సత్యనారాయణ, రామకృష్ణంరాజు మాట్లాడారు.

ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తణుకు

జిల్లా ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2025-27 కాలానికి జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆదివారం స్థానిక చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ కళాశాల(స్వ.ప్ర) గెజిటెడ్ అధ్యాపక సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ ఎన్నికలకు ఎలక్షన్ అధికారిగా పామర్రు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తెలుగు అధ్యాపకులు డాక్టర్ కెఆర్‌జి శేషుకుమార్ వ్యవహరించారు. ఈ జిల్లా కార్యవర్గానికి అధ్యక్షులుగా డిఆర్‌జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తాడేపల్లిగూడెం ఎకనామిక్స్ అధ్యాపకులు జె.విజయ్‌బాబు, కార్యదర్శిగా డిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాలకొల్లుకు చెందిన కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ జి.విజయ్ స్వరూప్‌సింగ్, కోశాధికారిగా బోటనీ అధ్యాపకులు డాక్టర్ ఎన్‌మణిమాల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జె.విజయ్‌బాబు మాట్లాడుతూ ప్రాథమిక సభ్యుల హక్కులు గురించి నిరంతరం రాష్ట్ర కార్యవర్గంతో చర్చిస్తూ, వారి సహకారంతో పోరాడతానని వాగ్దానం చేశారు. కళాశాలల్లో అభివృద్ధికు నిరంతరం కష్టపడతానని తెలిపారు. ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రవరం, కెమిస్ట్రీ అధ్యాపకులు, మాజీ అధ్యక్షులు కె.వెంకటరావు ఎన్నికైన నూతన కార్యవర్గానికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.అక్కిరాజు, అరవింద్‌స్వామి, టిఎస్ఎస్.ప్రసాద్, తణుకు ప్రభుత్వ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ ఆర్‌కె.ఫణింధర్, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.ఏడుకొండలు, ఎ.మారుతీదేవి చౌదరి పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఆర్‌డిఒ దాసిరాజు

నరసాపురం : క్రీడాకారులు గెలుపోటములతో ప్రమేయం లేకుండా క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. మండలంలోని గొంది గ్రామంలో ఆదివారం నిర్వహించిన బిఆర్ అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువతను క్రీడల వైపు మళ్లించేందుకు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్లో ప్రథమ స్థానంలో నిలిచిన గొంది జట్టుకు రూ.15 వేలు, షీల్డు, ద్వితీయ స్థానంలో నిలిచిన పాత నవరసపురం జట్టుకు రూ.10 వేలు షీల్డ్, తృతీయ స్థానంలో నిలిచిన అడవిపాలెం జట్టుకు రూ.5 వేలు, షీల్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గొంది, కాజ సర్పంచులు మద్దాల అంజిబాబు, గుబ్బల వేణు, పెదపాటి వర ప్రసాద్, విజేతలకు బహుమతులకు నగదు ప్రోత్సహమందించిన దావులూరి శేఖర్ బాబు, అంగాడి భాస్కరరావు, యర్రంశెట్టి సుభాష్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఆర్‌డిఒ

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కడకట్లలో జనతా హాస్పటల్లో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నిర్వహణలో పిఎంజెఎఫ్ లయన్స్ పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారంతో నిడదవోలు రాజరాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ హాస్పిటల్ వైద్యులు ఉచిత నేత్ర వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో 96 మందికి పరీక్షలు నిర్వహించి 20 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసి, పదిమందిని ఉచిత ఆపరేషన్ నిమిత్తం నిడదవోలు ఆసుపత్రికి పంపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రారంభించి మాట్లాడుతూ లయన్స్ క్లబ్, జనతా ట్రస్ట్ చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనతా ట్రస్ట్ అధ్యక్షులు వివిఎన్.లక్ష్మీనారాయన్, లయన్స్ గ్రంధి సత్యనారాయణ, చక్కా అప్పారావు, సుంకర శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్నం జగదీష్, భీమవరపు మహాలక్ష్మి, ఎల్ఎస్‌వి.నాగేశ్వరావు(జనత డాక్టర్), లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్మికులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. జాతరను పురస్కరించుకుని గ్రామంలో ఆలయం వద్ద మురళీ కోలాటం, మ్యూజికల్ నైట్, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని అర్ధరాత్రి గ్రామంలో ఊరేగిస్తూ పొలిమేర దాటించారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని వర్గ సంఘం ఆధ్వర్యంలో ఉద్ధగిరి సుబ్బారావు, గ్రంధి శ్రీను పరిరక్షణలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు చక్కెర పొంగలి, అన్నవరం ప్రసాదం, లడ్డు, బూందీ, సేమియా హల్వా, పులిహోర, కదంబరీ, శనగలు, దద్దోజనం, కట్టుపొంగలి తదితర ప్రసాదాలను పంపిణీ చేశారు.

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, గుణ్ణం నాగబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.జగదీష్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వేమన పద్యాలు అందరికీ సుపరిచితం

జయంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విశ్వదాభిరామ వినురవేమ అనే మకుటంతో వేమన రాసిన తెలుగు పద్యాలు ప్రతీ ఒక్కరికి సుపరిచితమని తెలుగు రచయిత పండితులు కలిగొట్ల గోపాలశర్మ, అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రమణ్యం అన్నారు. వీరమ్మ పార్క్‌లోని తెలుగు తల్లి విగ్రహం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, అరసవల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో వేమన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమన ఎంతో లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో, చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పాడన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పామర పండితులకు అర్థమయ్యే సరళరీతిలో వాడుక భాషలో తన కవిత్వం ద్వారా ప్రజల నాలుకలపై సజీవంగా నిలిచిన మహాకవి వేమన అన్నారు. నాలుగు రోజులపాటు వేమన జయంతి వేడుకలను పట్టణంలో నిర్వహిస్తామని, వివిధ పాఠశాలల విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.చాన్ భాషా, డిఆర్.నాగేశ్వరరావు, ఆడబల బాలాజీ, గ్రంధి అప్పాజీ, ప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్ర కర్ణ భక్తుల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

బిసిలు అంటే టిడిపి, టిడిపి అంటే బిసిలు అని రాష్ట్ర జలవనురుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులోని చాంబర్ భవనంలో జరిగిన శ్రీకర్ణభక్త సమాజ సంక్షేమ కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2025 క్యాలెండర్ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014, 2019, 2024 ఎన్నికల్లో తాను విజయం సాధించడానికి బిసిలు ముఖ్యంగా చేనేత, కర్ణ భక్తులు ముఖ్య భూమిక పోషించారని చెప్పారు. తాను వారికి ఎపుడు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వట్టం గణేష్, ట్రెజరర్ అల్లాడ కుమారస్వామి, జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్ మానెం బసవరాజు, పాలకొల్లు వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ కార్యదర్శి నీలంశెట్టి సత్యప్రసాద్, నరసాపురం సంఘం కార్యదర్శి అల్లంక నాగేశ్వరరావు, యర్రా శివాజీ, బాసిన గుణేశ్వరరావు, శీరం ఆనందకృష్ణ పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

కడియాల సత్యనారాయణ చౌదరి, S/o వెంకటేశ్వరరావు, పెదకడిమి గ్రామం అను నేను **సర్వే నంబర్ - 880/2B, 903/3, 620/2** (కొప్పాక రెవెన్యూ పరిధి) గల ఒరిజినల్ డాక్యుమెంట్స్ పెదకడిమి నుండి పెదవేగి మండలం రెవెన్యూ కార్యాలయానికి వెళ్ళు దారిలో పడిపోయినవి. కనుక ఎవరికైనా దొరికిన యెడల ఈ అడ్రస్‌కు తెలియజేయగలరు.

కడియాల సత్యనారాయణ చౌదరి
S/o వెంకటేశ్వరరావు
పెదకడిమి గ్రామం,
పెదవేగి మండలం, ఏలూరు జిల్లా
సెల్ : 95731 99789